పల్లె బాట పట్టిన పట్నం

- ఓటేసేందుకు సొంతూళ్లకు పయనం
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- విజయవాడ హైవేపై బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు భాగ్యనగరం పల్లెబాట పట్టింది. హైదరాబాద్‌లో ఉంటూ స్వగ్రామంలో ఓటు ఉన్నవారు కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామాల బాట పట్టడంతో మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజిబిఎస్), జూబ్లీ బస్‌స్టాండ్‌లతో పాటు సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. రైళ్లు, బస్సులు ప్రయాణీకులతో నిండిపోయాయి. ఎలాగైనా ఓటు వేయాలనే తపనతో రిజర్వేషన్ లేకున్నా ఇబ్బందులు పడుతూనే ఓటర్లంతా పల్లె బాట పట్టారు. ప్రయాణీకుల రద్దీని బట్టి అదనపు బస్సులు నడుపుతున్నామని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నప్పటికి నగరంలోని అన్ని ప్రధాన బస్ స్టేషన్లలో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ రోజుల్లో ఎంజిబిఎస్ నుంచి 3,500 బస్సులు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వెళుతుంటాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరో వెయ్యి అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు. అయినా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణీకుల రద్దీ కొనసాగుతూనే ఉంది.

కిక్కిరిసిన రహదారులు

గురువారం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవులు ప్రకటించడంతో సొంత కార్లు, ఇతర వాహనాలు ఉన్నవారు కూడా గ్రామాలకు బయల్దేరారు. ఒకేసారి కార్లు అన్ని రోడ్లపైకి రావడంతో నగరంలో పలు చోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహబూబ్ నగర్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్ జిల్లాలకు వెళ్లేందు బస్టాండ్లలో ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉంది. ఫలితంగా విజయవాడ, బెంగుళూరు హైవేలతో పాటు రాజీవ్ రహదారిపై కిలోమీటర్ల కొద్ది వాహనాలు బారులు తీరాయి. కాగా హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ర్యాపిడో బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఓటర్లకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఓట్లు వేసేందుకు నగర వాసులు సొంతూళ్లకు వెళ్లిపోతుండటంతో భాగ్యనగరం బోసిపోయింది.

పోలింగ్‌పై డేగ కన్ను

- రంగంలోకి కేంద్ర బలగాలు
- ఇవిఎంల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- రాచకొండ సిపి డీఎస్ చౌహాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాచకొండ పరిధిలోని మూడు జిల్లాల్లో పోలింగ్‌పై పోలీసులు డేగ కన్ను వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని, భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని రాచకొండ సిపి డిఎస్ చౌహాన్ తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలు తదితర అంశాలపై బుధవారం సిపి మీడియాతో మాట్లాడారు.

రాచకొండ పరిధిలో 8 వేల నుంచి 9 వేల మంది వరకు పోలీస్ సిబ్బందితోపాటు 25 కంపెనీల కేంద్ర బలగాలను రంగంలోకి దించామన్నారు. రాచకొండ పరిధిలో యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చేల్ మూడు జిల్లాలు ఉండడంతో పోలింగ్ అనంతరం కట్టుదిట్టమై భద్రతతో ఇవిఎంలను తరలిస్తామని తెలిపారు. మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, ఇవిఎంల తరలింపు సమయంలో మొదట కేంద్ర బలగాలు ఉంటాయని, వారికి సహాయంగా సివిల్ పోలీసులు పని చేస్తారన్నారు. ప్రతి రూట్‌లో 20 మందికిపైగా పోలీస్ సిబ్బందిని ఉపయోగిస్తున్నామని తెలిపారు. 3411 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరగుతుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సిసి టివి కెమెరాల నిఘా ఉందన్నారు. 30వ తేదీ సాయంత్రం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడొద్దన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు.

మద్యం, డబ్బుల పంపిణీపై ప్రత్యేక నిఘా వేశామని సిపి తెలిపారు. క్యూఆర్టీ బృందాలు, సివిల్, ఎస్‌ఒటి, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ప్రత్యేక నిఘా వేశాయన్నారు. ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా ఆందోళనకు దిగినా, బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడినా ప్రజలు డయల్ 100ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన

అసెంబ్లీ పోలింగ్ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఇబ్రహింపట్నం సివిఆర్ కళాశాలలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సిపి పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించినట్టు చెప్పారు. పలుచోట్ల ప్రత్యేక చెక్ పోస్టులుఏర్పాటు చేశామన్నారు.

నగదు అక్రమ తరలింపును అడ్డుకోవడానికి చేపట్టినట్టు కమిషనర్ తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వదంతులు షీష్టించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో 4 గంటల వరకే పోలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగనుంది. ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించింది. శుక్రవారం జరగనున్న ఎన్నికల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

రాష్ట్రంలోని 13 నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అవి సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావు పేట, భద్రాచలం నియోజకవర్గాలు. మిగిలిన చోట ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. సమస్యాత్మక నియోజకవర్గాలపై పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. ఓటర్లు సమయాన్ని గుర్తించి నిర్దేశించిన సమయంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

సాగునీటి శాఖ కొత్త కార్యదర్శిగా స్మిత సభర్వాల్

- నేడు రజత్‌కుమార్ ఉద్యోగ విరమణ
- ఇఎస్‌ఎఫ్‌టి కార్యదర్శిగా శాంతికుమారి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాగునీటిపారుదల అభివృద్ధి, ఆయకట్టు శాఖ కార్యదర్శిగా సిఎంఒ కార్యదర్శి స్మితసభర్వాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిఒ నెంబరు 1582ను ఇటీవల విడుదల చేసింది. అలాగే రెవెన్యూ రికవరిశాఖ బాధ్యతలు సైతం స్మీతసభర్వాలే చూస్తారు. పర్యావరణం, సైన్స్, సాంకేతిక శాఖ కార్యదర్శిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పూర్తి అదనపు బాధ్యతలు చేపడతారు. ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే వరకు ఈ జిఒ అమల్లో ఉండనుంది. ఇప్పటి వరకు ఈ రెండు శాఖల విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రజత్‌కుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి రజత్‌కుమార్ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రయివేటు కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన కూతురు పెండ్లికి ఒక ప్రయివేటు కంపెనీ ఆర్థిక సహకారం అందుకున్నారనే విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విమర్శలను రజత్‌కుమార్ ఖండించారు. ఈ వ్యవహారంలో కెసిఆర్ ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చిందనే ప్రచారం సాగునీటి శాఖలో ఇప్పటికే ఉంది.

పెద్దపల్లిలో రూ.31లక్షలు పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు బంధువుల ఇంట్లో మంగళవారం రాత్రి ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో విజయరమణరావుకు సంబంధించిన కుటుంబసభ్యులు ఆనందరావు ఇంటిపై దాడులు నిర్వహించి రూ.31లక్షలు పట్టుకున్నారు. ఈ డబ్బు ఓటర్లకు పంచేందుకు దాచారని ప్రాథమిక నిర్ధారణకు రావడంతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నగదును పెద్దపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలించారు.

రైతుల్ని శిక్షిస్తే ఏం లాభం...?

- హరీశ్ తప్పుగా మాట్లాడితే ఆయనకే నోటీసులివ్వాలి?
- పాత్రికేయులతో ఇష్టాగోష్టిలో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుబంధు విషయంలో మంత్రి హరీశ్‌రావు తప్పుగా మాట్లాడినా.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా ఆయనకే నోటీసులివ్వాలి..? ఆయనపైన్నే చర్యలు తీసుకోవాలి కదా...? అందుకు భిన్నంగా రైతుబంధును ఆపి, అన్నదాతలను శిక్షిస్తే ఎలా...?' అంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ 88 సీట్లతో అధికారంలోకి రాబోతోందనీ, కెసిఆర్ ముచ్చటగా మూడోసారి సిఎం కాబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాత్రికేయులతో కెటిఆర్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్ పోటీ చేసిన రెండు చోట్లా (కొడంగల్, కామారెడ్డి) ఓడిపోబోతున్నారని ఈ సందర్భంగా చెప్పారు. తన నియోజకవర్గమైన సిరిసిల్లలో ఎన్నిక చాలా క్లిష్టంగా ఉందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని విమర్శించారు. ఏ పార్టీకైనా అధికారంలోకి రావటానికి 51 శాతం ఓట్లు చాలని అన్నారు. రకరకాల కారణాల రీత్యా మిగతా 49 శాతం ఓట్లు పడకపోయినా ఫరవాలేదన్నారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ 51 శాతం ఓట్లతో అధికారంలోకి రాబోతున్నదని చెప్పారు. అనేక స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ పరస్పరం సహకరించుకుంటున్నాయని విమర్శించారు. అందుకే గోషా మహల్‌తోపాటు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ పోటీ చేస్తున్న స్థానాల్లో కాంగ్రెస్ బలహీన అభ్యర్థులను నిలబెట్టిందని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో రోడ్ షో చేపట్టిన రాహుల్ గాంధీ... పక్కనే ఉన్న గోషా మహల్‌కు ఎందుకు వెళ్లలేకపోయారని ప్రశ్నించారు. కరీంనగర్, కోరుట్లలో రాహుల్‌తోపాటు రేవంత్ కూడా ప్రచారం చేయలేదని గుర్తు చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి తాను విసిరిన సవాల్‌కు కాంగ్రెస్ నేతలెవ్వరూ ఇప్పటి వరకూ సమాధానం చెప్పలేదని ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ తెలంగాణలో చేసిన ఎన్నికల ప్రచారమంతా... రాబోయే పార్లమెంటు ఎన్నికల కోసమేనని కెటిఆర్ వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో 108 సీట్లలో డిపాజిట్ కోల్పోయిన బిజెపికి... ఈసారి 110 స్థానాల్లో ధరవాతు గల్లంతు కానుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా సైలెంట్ ఓటు బిఆర్‌ఎస్‌కే అనుకూలంగా ఉందనీ, హైదరాబాద్‌లో సైతం తమ పార్టీ గాలి వీయనుందని వివరించారు.

ముగ్గురు పోలీసు అధికారులపై ఇసి వేటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పక్షపాతం చూపించారని ముగ్గురు పోలీసు అధికారులను ఇసి బుధవారం సస్పెండ్ చేసింది. నగరంలోని ముషీరాబాద్ పరిధిలో నగదు స్వాధీనం వ్యవహారంలో పక్షపాతం చూపించారని డిసిపి వెంకటేశ్వర్లు, ఎసిపి యాదగిరి, సిఐ జహంగీర్‌లను ఎన్నికల సంఘం విధుల నుంచి తప్పించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇసి లేఖ రాసింది. ఎన్నికల తనిఖీల్లో భాగంగా ముషీరాబాద్‌లోని సంతోష్ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లో రూ.18 లక్షల నగదు, చెక్‌బుక్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదు ముషీరాబాద్ బిఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ కుమారుడు ముఠా జైసింహదిగా గుర్తించిన పోలీసులు, ఎఫ్‌ఐఆర్‌లో నిందితుల వివరాలు గుర్తు తెలియని వారిగా పేర్కొన్నారు. ఈ కేసులో ముఠా జైసింహను కాకుండా ముఠా గోపాల్ స్నేహితులు సంతోష్, సుధాకర్‌లను అరెస్టు చేశారు. అసలైన నిందితులను అరెస్టు చేయకుండా, సరైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఇసి గుర్తించింది. దీంతో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్, చిక్కడపల్లి ఎసిపి యాదగిరి, సెంట్రల్ జోన్ డిసిపి వెంకటేశ్వర్లను సస్పెండ్ చేస్తూ ఇసి ఉత్తర్వులు జారీ చేసింది. సిఐ జహంగీర్ స్థానంలో ముషీరాబాద్ స్టేషన్‌లో పనిచేస్తున్న డీఐ వెంకట్ రెడ్డిని, చిక్కడపల్లి ఎసిపిగా మధుమోహన్ రెడ్డిని, సెంట్రల్ జోన్ డిసిపిగా డి. శ్రీనివాస్ నియమించినట్లు హైదరాబాద్ సిపి సందీప్ శాండిల్య తెలిపారు.

తలసేమియా రోగులకు రక్తం కొరత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తలసేమియా రోగులు రక్తం కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులు రెగ్యులర్‌గా నిర్దిష్ట సమయంలో రక్తమార్పిడి చేసుకుంటూ జీవితాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించి వారికి అందజేసేందుకు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్ సీఎస్) కృషి చేస్తున్నది. ఎప్పుడు టీఎస్‌సిఎస్ వద్ద 600 యూనిట్లనుంచి 700 యూనిట్ల వరకు అన్ని బ్లడ్ గ్రూపులకు చెందిన రక్తం నిల్వ ఉంటుంది. రాష్ట్రంలో నెలకొన్న ఎన్నికల సీజన్ కావడంతో రక్తదాతలు ప్రస్తుతం టిఎస్‌సిఎస్ వద్ద కేవలం 100 యూనిట్ల రక్తం మాత్రమే ఉండటం, అందులో కొన్ని బ్లడ్ గ్రూపులకు చెందిన రక్తం అసలే లేకపోవడంతో ఆందోళన నెలకొన్నది. తలసేమియా అనేది ఒక జన్యుపరమైన వ్యాధి. ఈ వ్యాధిగ్రస్తులు మిగిలిన వారి మాదిరిగా సాధారణ జీవితం గడపాలంటే వారికి తరచుగా రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల సీజన్‌లో ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు రక్తం కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, తలసేమియా రోగులను ఆదుకునేందుకు స్వచ్ఛంధ రక్తదాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాల్సిన అవసరమున్నది.

ఆరోగ్యంపై ప్రభావం :డాక్టర్ సుమన్ జైన్

తలసేమియా రోగులకు సకాలంలో రక్తమార్పిడి చేయకపోతే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ సిఇఒ, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్ తెలిపారు. ఇప్పటికే రక్తం కొరతతో ఉన్న ఇబ్బందికి తోడు ఎన్నికల సీజన్‌లో ఏర్పడిన కొరత సంక్షోభాన్ని తలపించేలా ఉందన్నారు. ఈ పరిస్థితి రోగుల ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తదాతలు ముందుకొచ్చి వారిని ఆదుకోవాలని సుమన్ జైన్ కోరారు.

కల్వకుర్తిలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకుల ఘర్షణ

- ఇద్దరిపై చేయి చేసుకున్న మున్సిపల్ చైర్మన్
- పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికలకు ఒక్క రోజు ముందు కల్వకుర్తిలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ చెలరేగింది. పట్టణంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారం మేరకు బిఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ సత్యం అనుచరులతో కలిసి వారి వద్దకు వెళ్లి గొడవపడ్డారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల మధ్య తోపులాట జరిగింది. మున్సిపల్ చైర్మన్ సత్యం ఆగ్రహంతో ఊగిపోతూ మాజీ వైస్ ఎంపిపి బొమ్మ ఆంజనేయులు, రమాకాంత్ రెడ్డిపై చెయ్యి చేసుకోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగంలోకి దిగి ఇరువురినీ శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అకారణంగా మాపై దాడి చేశారంటూ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు వ్యాపార సంస్థలను మూసేసి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. మున్సిపల్ చైర్మన్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డబ్బులు పంచుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు ప్రకటించారు.

ఓటర్ స్లిప్ ఇంకా అందలేదా ? అయితే ఇది ఫాలో కండి !

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీకు ఇంకా ఓటర్ స్లిప్ అందలేదా? మీరు ఓటు ఎక్కడ వేయాలో తెలియడం లేదా?, మీ చేతిలో ఓటర్ గుర్తింపు కార్డు ఉన్నా.. ఏం చేయాలో అర్థం కావడంలేదా? మీ పోలింగ్ సెంటర్ ఎక్కడుందో తెలియక కన్‌ఫ్యూజ్ అవుతున్నారా? అయితే ఆందోళన పడకండి. ఈ అంశాలు అవగాహన చేసుకోండి.. ముందుకు సాగిపోండి ఇలా..

నిజానికి ఎన్నికల ముందు ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేయడం ఎన్నికల సంఘానికి చెందిన బ్లాక్‌లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ) ల పని. కానీ ఇప్పటిదాకా చాలా చోట్ల ఓటర్ స్లిప్‌ల పంపిణీ ఇంకా పూర్తికాలేదు. దీంతో సహజంగానే ఓటర్లు అయోమయానికి, ఆందోళనకు గురవుతుంటారు. ఏ ఓటింగ్ కేంద్రానికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. అది ఎలాగో..చూడండి.

ఓటర్ స్లిప్‌లు ఇంకా అధికారులు అందించకపోతే ఆన్‌లైన్ ద్వారా గానీ, మొబైల్ యాప్ ద్వారా గానీ, హెల్ప్ లైన్ నెంబర్ ద్వారా గానీ, ఎస్ఎంఎస్ ద్వారా పొందడానికి ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది.

1. అయినా మీకు ఓటర్ స్లిప్ అందకపోతే నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి చెక్ చేసుకోవచ్చు.
2. పోలింగ్ కేంద్రంలో మీ పేరు ఉన్నట్టయితే గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు

పై పద్ధతుల్లో ఓటర్ స్లిప్‌ను పొందవచ్చు. ఒకవేళ ఆ విధంగా కూడా రాకపోతే మాత్రం ఈ కింది పద్ధతులను పాటించండి.

మెసేజ్‌తో ఇలా..

మీ చేతిలో ఫోన్ ఉంటే.. ఒక్క మెసేజ్‌తో పోలింగ్ బూత్ వివరాలను ఇంట్లో నుంచే తెలుసుకోవచ్చు. మీ దగ్గర గుర్తింపు కార్డు ఉంటే ఓటర్ నంబర్ టైప్ చేసి 1950 లేదా 92117 28082 నెంబర్‌కు ఎస్ఎంఎస్ పెడితే బూత్ వివరాలు వెంటనే వస్తాయి.

ఎన్నికల సంఘం దగ్గర 24 గంటలూ పని చేసే టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. 1950కి ఫోన్ చేసి పోలింగ్ కేంద్రం, బూత్, నెంబర్, తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

నాలుగు రోజులు వర్షసూచన

- పోలింగ్‌కు ముందు టెన్షన్
- వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధిత యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. కొన్ని గంటల్లో పోలింగ్ జరగనుంది. ఇక ఓటింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటికే ఆయా పార్టీలు భారీస్థాయిలో ప్రచారం చేశాయి. ఓటింగ్‌పై ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. ఈ సమయంలో ఊహించని రీతిలో వాతావరణ శాఖ కుండబద్దలు కొట్టింది.

అల్పపీడనం కారణంగా తెలంగాణలో పలుప్రాంతాల్లో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అధికారులు హెచ్చరికలు జారీచేశారు. తాజా సమాచారంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకింత ఆందోళన చెందుతున్నాయి. వానలు పడి.. పోలింగ్ సరిగ్గా జరగపోతే పరిస్థితి ఏంటనే విషయమై టెన్షన్ పడుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని పార్టీలు భయాందోళనకు గురవుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం వాయు గుండంగా బలపడనున్నట్లు సమాచారం. బంగాళాఖాతంలో వాయవ్య దిశగా పయనించి 48 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే పరిస్థితి ఉందని ఉన్నట్టు తెలియజేసింది. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో భారీగా వానలు పడతాయని కూడా అధికారిక సమాచారం. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి సంగారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, నల్లగొండ, భద్రాద్రి-కొత్తగూడెం, వరంగల్ జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటించింది.

దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్

- హైకోర్టుకు తెలిపిన ఇసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించలేదంటూ ఉపాధ్యాయ సంఘాలు వేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ ముగించింది. పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇవ్వకపోవడంతో ఓటు వేసే హక్కును కోల్పోతున్నామని ఉపాధ్యాయ సంఘాలు పిటిషన్‌లో పేర్కొన్నాయి.

ఎన్నికల విధుల్లో ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామని ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. 28వ తేదీ వరకు 1.75లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని కోర్టుకు వివరించారు. ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు విచారణను ముగిస్తున్నట్టు తెలిపింది.

పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

- వివాదాస్పద వ్యాఖ్యలపై ఎంపిడిఒ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైనట్టు సిఐ సంజీవ్ తెలిపారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి "నన్ను గెలిపిస్తే విజయోత్సవ యాత్రకు వస్తా.. ఓడిస్తే నా శవయాత్రకు రండి" అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దాంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ఎంపిడిఒ ఫిర్యాదు చేయడంతో కమలాపూర్ పోలీస్టేషన్‌లో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్టు సిఐ సంజీవ్ తెలిపారు. మరోవైపు కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎలక్షన్ కమిషన్ సీరియస్ అయింది. విచారణ జరిపి వివేదిక అందించాలని రిటర్నింగ్ అధికారిని ఇసి ఆదేశించింది.

NOTICE
IN THE COURT OF THE HON'BLE 2ND ADDL. SENIOR CIVIL JUDGE :: GUNTUR
E.P.No.272/2018 in O.S.No.443/2013
Between:
Damarla Vasantha Rao ...D.H.R.
AND
Komarapuri Gangachalam & Others ...J.D.R.'s
To,
J.D.R. No-4: Komarapuri Chandramouli, S/o. Gangachalam, Reliance Building Construction Office, Near Care Hospital, Road No.10, Banjara Hills, Hyderabad.
పై నెంబరు E.P.లో **4వ జె.డి.ఆర్.** అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా SALE నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది.11-12-2023 ఉ.గం. 10.30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేట్ ద్వారా గాని, హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 11-12-2023
జి.వి.రమణ, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9848231931

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
H.M.O.P. 131/2022
Between:
Pratikantham Uma Venkata Satya Renuka ***...Petitoner***
AND
Pratikantham Gunavardhan Raju, S/o. Venkata Krishnam Raju, Hindu, Male, aged 45 years, Software Engineer in T.C.S. R/o. D.No. 16-2-741/B/50/1, Asmanghad, Malakpeta, Hyderabad, HJCJC. ***...Respondent***
కోర్టు ప్రకటన
పై నెంబరు గల H.M.O.P. లో Respondent గారికి ఎన్నిసార్లు నోటీసులు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్‌కి నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయిన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **ది. 22-12-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.
NEKKARAGANTI NARASIMHA RAO
Eluru — Advocate, Eluru
Dt.24-11-2023 — Cell: 9848118984

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST AT: L.B NAGAR
O.S. No. 770 OF 2023
BETWEEN:
1. Konduru Mamatha, W/o Late Konduru Krishnaiah alias Konduru Krishna Murthy, Age 52 years, Occupation: House wife, Resident of H.No.5-38-1, Mall Village, Yacharam Mandal, Nallavelly Post, Ranga Reddy District, 501509.
2. Konduru Mahesh, S/o Late Konduru Krishnaiah alias Konduru Krishna Murthy, Age 32 years, Occupation: Business, Resident of H.No.5-38-1, Mall Village, Yacharam Mandal, Nallavelly Post, Ranga Reddy District, 501509.
3. Konduru Mounika alias Rachakonda Mounika, D/o Late Konduru Krishnaiah alias Konduru Krishna Murthy, W/o.Rachakonda Bhanuchander, Age 30 years, Occupation: House wife, Resident of H.No.4-129, jilella, Karimnagar, 505405.
4. Konduru Manasa, D/o Late Konduru Krishnaiah alias Konduru Krishna Murthy, Age 29 years, Occupation: House wife, Resident of H.No.5-38-1, Mall Village, Yacharam Mandal, Nallavelly Post, Ranga Reddy District, 501509.
...Plaintiffs
AND
1. All Concerned
2. State of Telangana, *Rep. by* The Tahsildar, Balapur Revenue Mandal, Ranga Reddy District, Telangana State.
...Defendants
Whereas the above-named Plaintiffs filed the above suit for Declaration, to passed declaring the Plaintiffs No.1 to 4 as the Legal Heirs or family members of Late Konduru Krishnaiah alias Konduru Krishna Murthy, S/o. Konduru Venkatesham and entitled to the notice schedule property and the matter is posted for the any claims/objections from any concern. Hence if any person is/are having any claims/objections they may appear before this Hon'ble Court on 08-12-2023 at 10:30 either in person or through an Advocate, duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in exparte.
NOTICE SCHEDULE PROPERTY
All that the Piece and Parcel of the open land bearing Plot No.721, admeasuring 300 Square yards or its equivalent to 250.83 Square meters, in forming Part of Survey Nos.92 and 93, Situated at Almasguda Village, Balapur Revenue Mandal, Ranga Reddy District, Under Badangpet Municipal Corporation **(formerly Almasguda Grama panchayath)** and bounded by:
NORTH : Plot No.666. SOUTH : 20'-0' Wide Road. EAST : Plot No.720. WEST : Plot No.722. 1)
(By order of the Court)
Sd/-
K.SUDHAKER
(Advocate)

18 నెలల శిశువుకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకటిన్నర సంవత్సరాల వయసు కన్నా తక్కువ వయస్సు కలిగిన శివ్‌కన్యకు చేసిన కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స విజయవంతమైనట్లు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది డిసెంబర్‌లో గాంధీ ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగం ఆధ్వర్యంలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు పలు సర్జరీలు చేసిన వారిలో శివ్‌కన్యది చిన్న వయస్సు. ఆస్పత్రి పీడియాట్రిక్ విభాగంతో కలిసి ఇఎన్‌టి వైద్యులు యూనివర్సల్ న్యూ బార్న్ హియరింగ్ స్క్రీనింగ్ కింద అతి చిన్న వయస్సులోనే ఈ లోపాన్ని గుర్తిస్తున్నారు. తద్వారా సాధారణ బడుల్లోనే ఇలాంటి పిల్లలు చేరేలా వారికి మాట్లాడటం, భాషను గుర్తించే పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారు. సంగారెడ్డికి చెందిన శివ్ కన్య శస్త్రచికిత్స విజయంతం కావడం పట్ల ఈఎన్‌టీ విభాగం అధిపతి ప్రొఫెసర్, డాక్టర్ ఎ శోభన్ బాబు, అనెస్తీషియా విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మురళీధర్ వారి బృందాలకు, ఆడియాలజీ విభాగం సిబ్బంది కె సాయి కిరణ్, కె అనూషలకు సూపరింటెండెంట్ అభినందనలు తెలిపారు.

మహ్మద్ అజారుద్దీన్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ అజారుద్దీన్ ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోలిచౌకి బృందావన్ కాలనీ ఫ్లాట్ 100లో మంగళవారం సాయంత్రం మహ్మద్ అజారుద్దీన్‌తోపాటు మరికొందరు సమావేశం నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు సమాచారం అందింది. అధికారి అభిషేక్ తివారీ, ఫిల్మ్‌నగర్ పెట్రోలింగ్ అధికారులు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ.గణేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహ్మద్ అజారుద్దీన్, డాక్టర్ మొహమ్మద్ ఖలీల్, సయ్యద్ అఫ్రోజ్, షౌకత్ అలీ, సయ్యద్ రషీద్ హుస్సేనీ, రెహమాన్, జునై ఖాసీం అక్కడే ఉన్నారు. ఐదు గంటల తర్వాత నిశ్శబ్ద సమయంలో నిర్వహించిన సమావేశంగా భావించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

నటి సూర్యకాంతం విగ్రహం ప్రతిష్టించాలి

- జస్టిస్ రామలింగేశ్వర రావు

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖలైన సినీ ,రాజకీయ పురుషులకు వారి మరణం అనంతరం విగ్రహాలు ప్రతిష్టించడం సాధారణమని నటనా పటిమతో తన పేరును సుస్థిరం చేసుకున్న మహిళా శక్తి ప్రతీక సూర్యకాంతం విగ్రహ ప్రతిష్ట జరగాలని ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ రామ లింగేశ్వర రావు కోరారు. ఆమె జన్మస్థలం కాకినాడలో విగ్రహం పెడితే ముందు తరాల వారికి సూర్యకాంతం తమ ప్రాంతానికి చెందిన ప్రముఖులు అని తెలుస్తుందని అన్నారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళా వాహిని నిర్వహణలో విఖ్యాత నటి సూర్యకాంతం శత జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ నటి అన్నపూర్ణను సూర్యకాంతం స్మారక పురస్కారంతో సత్కరించి జస్టిస్ రామ లింగేశ్వర రావు మాట్లాడారు. సూర్యకాంతం వంటి నటి మరల తెలుగు సినీ పరిశ్రమలో రాలేదన్నారు..అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ జమున భానుమతి సావిత్రి వంటి కథానాయికలు ఎందరో వుండొచ్చు కానీ సూర్యకాంతం సాటి నటి ఆమె నని కొనియడారు. అన్నపూర్ణ విలక్షణ వాచకం అభినయం, అంగికం ఆకట్టుకుంటాయి అని వివ రించారు.వేదిక పై రచయిత్రులు డాక్టర్ కె.వీ.కృష్ణ కుమారి, వాసవ దత్త రమణ, మాధురి దర్శకుడు శివ నాగేశ్వరరావు జర్నలిస్ట్ రామా రావు పాల్గొన్న సభకు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు.

ఏజెన్సీలో హై అలర్ట్

- యాక్షన్ టీం కదలికల నేపథ్యంలో.. డ్రోన్ కెమెరాలు
- ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో జల్లెడ
- గోదావరి పరివాహక ప్రాంతాల్లో పోలీసుల డేగ కన్ను

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో ఏజెన్సీలో హై అలర్ట్ నెలకొంది. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లో పోలీసులు స్పెషల్ ఆపరేషన్ తలపెట్టారు. ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాల్లో విస్తృత తనిఖీలు జరుపుతున్నారు. తెలంగాణ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలోకి మావోయిస్టు యాక్షన్ టీం ప్రవేశించిందని నిఘా వర్గాల సూచనలతో ఎటువంటి అవాంఛనీయ సంకటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. యాక్షన్ టీం కదిలికలపై నిఘా పెట్టారు.

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గోదావరి పరివాహక ప్రాంతాలపై పోలీసులు డేగ కన్ను వేశారు. ప్రధాన రహదారులపై నిత్యం ఏదో ఒకచోట పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. సరిహద్దు గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘాను పటిష్టం చేశారు. భద్రాద్రి జిల్లా చర్ల మండలం పూసుకుప్ప అటవీ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి సమయంలో మావోయిస్టులు ధాన్యం లారీని దగ్ధం చేసిన విషయం విదితమే. ఇది మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం పని అని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెంతోపాటు ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ములుగు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు.. ఎటునాగారం ఎఎస్‌పి సంకీర్త్ సూచనల మేరకు వెంకటాపురం సిఐ ఆధ్వర్యంలో వెంకటాపురం, వాజేడు, పేరూరు ఎస్‌ఐలు ఆర్.అశోక్, వెంకటేశ్వర్లు, రమేష్ తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వాహనదారుల లైసెన్సులు, ఆధార్ కార్డుల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి డాక్టర్ వినీత్ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఎన్నికల సందర్భంగా పోలీసు శాఖ అన్ని రకాల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

ప్రత్యేక దృష్టి

తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఏజెన్సీ మావోయిస్టు ప్రాంతం ములుగు జిల్లాలో జిల్లా ఎస్‌పి గౌస్ ఆలం ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలో 307 పోలింగ్ కేంద్రాలు, 202 పోలింగ్ లోకేషన్స్ ఉన్నాయి. వీటిలో సాధారణ, సమస్యాత్మక, మావోయిస్టు ప్రభాత ప్రాంతాలుగా గుర్తించారు. ఇప్పటికే 19 కంపెనీలకు చెందిన 1300 మంది సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్‌ఫోర్సు బలగాలను రప్పించారు. జిల్లాకు చెందిన 650 మంది హోంగార్డులతో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 300 మంది హోంగార్డులు, 78 మంది వివిధ రకాల ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గ్రేహౌండ్స్, జిల్లా స్పెషల్ పార్టీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ పార్టీలను సిద్ధం చేశారు.

పోలింగ్ సామగ్రి కేంద్రంలో వసతుల లేమీ..

- ఇబ్రహీంపట్నంలో రెండు వేల మంది సిబ్బంది.. మూడు బాత్రూములు
- మహిళా ఉద్యోగుల ఇక్కట్లు
- ప్రమాదకరంగా విద్యుత్ కనెక్షను

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రం వద్ద కనీస వసతులు మరిచారు. సుమారు రెండు వేల మంది ఉద్యోగులకు మూడు మరుగుదొడ్లు మాత్రమే ఏర్పాటు చేశారు. వాటిలో రెండు మరుగుదొడ్లు పురుషులకు కేటాయించగా, ఒక్కటి మాత్రమే మహిళలకు కేటాయించారు. మహిళా ఉద్యోగులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళపల్లి సమీపంలో ఉన్న సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మందికి పైగా ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. వీరిలో సుమారు 200 మందికి పైగా పోలీసు సిబ్బంది ఉన్నారు. వీరిలో మహిళా కానిస్టేబుల్స్ ఉన్నారు. సుమారు 500 నుంచి 600 మందికి పైగా మహిళా ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. వీరందరికీ ఎన్నికల అధికారులు కనీస ఏర్పాట్లు చేయలేదు. ప్రధానంగా మహిళా ఉద్యోగులకు ఒకే మరుగుదొడ్డి కేటాయించడంతో ఇబ్బందులు పడ్డారు. బయట పరిసరాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ఓ ఉద్యోగి సొమ్మసిల్లి పడిపోయాడు.

ప్రమాదకరంగా విద్యుత్ కనెక్షన్

పంపిణీ కేంద్రానికి అమర్చిన విద్యుత్ కనెక్షన్ ప్రమాదకరంగా ఉంది. అతుకుల కలెక్షన్లతో షాకు తలిగే ప్రమాదం పొంచి ఉంది. అతుకుల కనెక్షన్‌కు టేపును బిగించకుండా ప్లాస్టిక్ కవర్ చుట్టారు. ప్లాస్టిక్ కవర్ కాలి పొగలు వస్తుండటంతో పోలీసులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే నిర్వాహకులకు సమాచారం ఇచ్చినా లైట్‌గా తీసుకున్నారు.

భోజనం వసతులు అంతంతే..

ఎంతో దూరం నుంచి ఉదయం 10 గంటలకే ఎన్నికల సిబ్బంది పరికరాల పంపిణీ కేంద్రానికి చేరుకున్నారు. మధ్యాహ్నంలో పప్పు కర్రీ, ఎగ్ కర్రీ, మజ్జిగ, సాంబార్ ఏర్పాటు చేసినా సంగం మందికే సరిపోయింది. మిగతావారు పప్పుతోనే సరిపుచ్చుకున్నారు. దీంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు.

మోడల్ పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఎన్నికల కమిషన్ సరికొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. ఓటర్లను ఆకర్షించేలా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో 12 మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. గత ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా, ఈసారి యువత, దివ్యాంగులకు సైతం ఏర్పాటు చేస్తున్నారు. రఘునాథపల్లి మండలం గూడెం గ్రామంలో మహిళలే నిర్వహించే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా కేటగిరీల్లో ఎక్కువ మంది ఓటర్లు కలిగిన కేంద్రాలను మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాల వివరాలను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం మౌలిక వసతులు కల్పించి, ఆకర్షణీయమైన హంగులతో, సరికొత్త శైలితో ఓటరు నమోదు శాతాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు ఆసక్తి చూపుతున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి తంగిరాల చక్రవర్తి

- నవ తెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామ్యవాద భావజాలానికి నిలువుటద్దం తంగిరాల చక్రవర్తి అని నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్ అన్నారు. హైదరాబాదలోని నవతెలంగాణ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన తంగిరాల చక్రవర్తి పదవీ విరమణ సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బయట ప్రపంచంలో తంగిరాల గడిపిన జీవితం ఎలా ఉన్నా మార్కిస్టు ఆర్గనైజేషన్‌లోకి వచ్చిన తర్వాత నిజమైన మార్క్సిస్టుగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. నవతెలంగాణ బుక్ హౌస్ ఎడిటర్ ఆనందా చారి మాట్లాడుతూ తంగిరాల తెలుగు సాహితీ, కళా రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. 60కిపైగా పుస్తకాలు రాయడంతోపాటు వేలాది పుస్తక సమీక్షలు రాశాడని తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు, మోటూరి హన్మంతరావు, నండూరి ప్రసాదరావుల నుంచి నేటి వరకు అందరితో మమేకమైన వ్యక్తి అని కొనియాడారు. తెలుగు నాటక రంగాన్ని బతికించాలనే లక్ష్యంతో 25 ఏండ్లుగా తన తండ్రి పేరిట పురస్కారాలను అందిస్తున్నారని తెలిపారు. కాలంతో పోటీపడుతూ దారి తప్పని గొప్ప రచయిత, కళాకారుడు, తంగిరాల తన ఉద్యోగ విరమణ తర్వాత కూడా వివిధ రూపాల్లో కళా, సాహిత్య, రాజకీయ రంగాల్లో సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్ మాట్లాడుతూ దశాబ్ద కాలానికిపైగా ప్రజాశక్తి బుక్‌హౌస్, నవ తెలంగాణ పత్రికలో వివిధ హోదాల్లో నిబద్ధతతో తన సేవలందించారని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త శాంతారావు మాట్లాడుతూ తెలుగు సాహితీ, నాటక రంగాలకు అయన చేసిన సేవలు మరవలేనివని అన్నారు. తంగిరాల మాట్లాడుతూ నాకు తల్లిదండ్రులు జన్మనిస్తే, జ్ఞానబిక్ష పెట్టింది సిపిఎం పార్టీయేనని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ చేసినా చివరి వరకు తెలంగాణ సాహితీ సంస్థ కోసం, పార్టీ కోసం, కృషి చేస్తానని తెలిపారు. 2009లో తాను ప్రజాశక్తిలో చేరానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత నవ తెలంగాణలో కొనసాగడం... దశాబ్దంన్నర కాలంలో రెండు సంస్థలు తనకు ఎంతో సహకరించాయని అన్నారు. ఈ కార్యక్రమానికి వెబ్ ఇన్‌చార్జ్ అనంతోజు మోహన కృష్ణ స్వాగతోపనాస్యం చేయగా, హెచ్‌ఆర్ నరేందర్‌రెడ్డి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యూరో ఇన్‌ఛార్జ్ పద్మరాజు, సలీమా, తంగిరాల కుటుంబ సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

పదవీ విరమణ సభలో తంగిరాలను అభినందిస్తున్న సుధా భాస్కర్, ఆనంద చారి, రమేష్ తదితరులు

విధి నిర్వహణతో పాటు బిడ్డ ఆలనాపాలనా

- ఎన్నికల బందోబస్తుకు హాజరైన మహిళా పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటు ప్రజా సేవలో.. ఇటు కన్నబిడ్డ ఆలనాపాలనాలో మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహణలో ఉన్నారు. మీటింగ్‌కు వెళ్తున్నానని బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఐఒసి ప్రాంగణంలో తన కన్నబిడ్డకు చెప్పకనే చెప్పారు ఓ మహిళా పోలీసు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా బందోబస్తు ఏర్పాటుకు అడిషనల్ డిసిపి ఆధ్వర్యంలో పోలీసులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమానికి మహిళా పోలీసు సిబ్బంది హాజరయ్యారు. అదే సమయంలో తన పిల్లల ఆలనా.. పాలనా చూసుకుంటున్న నేపథ్యంలో ప్రజాశక్తి కెమెరా క్లిక్ మనిపించింది. ఓ వైపు వృత్తిపరంగా పోలీసు విధులు నిర్వహించాలి.. మరోపక్క పిల్లలను చూసుకోవాలి. ఎన్నికల విధులకు వెళ్లే ముందు పసిబిడ్డలను వదల్లేక తల్లడిల్లుతున్నారు.

ఏరులై పారిన మద్యం

- సిరిసిల్ల జిల్లాలో రూ.60.55 కోట్ల విక్రయం
- మద్యం, డబ్బు ఎరగా ప్రలోభాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల జిల్లాలో మద్యం ఏరులై పారింది. నగదు సైతం విచ్చలవిడిగా పంపిణీ జరిగింది. ఓవైపు ఎక్సైజ్ పోలీస్ అధికారులు పటిష్టమైన నిఘా ఉంచినా.. మద్యం, నగదు పంపిణీ ఆగలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి బుధవారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా అధికారికంగా ఎన్నికల కోడ్ విధించిన 50 రోజుల్లో సుమారు రూ.60.55 కోట్ల మద్యం అమ్మకాలు జరగడం ఇందుకు నిదర్శనం. అనాధికారికంగా మద్యం అమ్మకాలు ఇందుకు రెట్టింపు ఉంటుంది.

ఓటర్లను ప్రభావితం చేసేందుకు..

అధికారుల పటిష్ట నిఘా, నిరంతరం తనిఖీలను తప్పించుకుంటూ నాయకులు తమ అనుచరుల నివాసాల్లో పెద్ద మొత్తంలో మద్యం నిల్వలు చేసినట్టు తెలిసింది. రాత్రి వేళల్లో ఓటర్లకు పంపిణీ చేసినట్టు సమాచారం. సిరిసిల్ల వేములవాడ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 48 మద్యం దుకాణాలు, 8 బార్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ విధించినప్పటి నుంచి అంటే.. అక్టోబర్ 9 నుంచి నవంబర్ 29వ తేదీ వరకు సుమారు రూ.60.55 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్టు అధికారులు పేర్కొన్నారు. వీటిలో 52462 లిక్కర్ పెట్టెలు, 1,20,700 బీర్ల పెట్టెలు అమ్మినట్టు తెలిపారు. బెల్ట్ షాపులతోపాటు అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిగాయి. అనుమతి లేని విక్రయాలపై అబ్కారీ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో పోలింగ్ నిర్వహించే ప్రాంతాల్లో పటిష్టంగా నిఘా, భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు.

జిల్లాలో 320 లీటర్ల లిక్కర్, 223 లీటర్ల బీర్లు, 11 వాహనాలు సీజ్ చేసి 43 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బెల్టు షాపులు, అనధికారిక మద్యం అమ్మకాలపై 43 కేసులు నమోదు చేశారు. బెల్టు షాపుల నిర్వహణతోపాటు నాటుసారా, గుడుంబా మద్యం తయారు చేస్తారని అనుమానంతో సుమారు 82 మందిని తహసీల్దారుల ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.

ఓటేసేందుకు అమెరికా టు తెల్దారుపల్లికి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన యల్లంపల్లి సందీప్ అమెరికాలోని చికాగోలో ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు తెల్దారుపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ అమెరికాలో ఎన్నో ముఖ్యమైన పనులు ఉన్నా ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటు వేసేందుకు సొంత ఊరికి ప్రత్యేకంగా వస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సందీప్ ప్రజలకు సూచించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సందీప్‌ను అభినందించారు.

హైదరాబాద్‌లో సి1 గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : సి1 (గతంలో కన్వర్జ్‌వన్) బుధవారం హైదరాబాద్‌లో తన గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కెపాబిలిటీ సెంటర్ (జిఐసిసి)ని ప్రారంభించింది. అధునాతన సాంకేతికత, పరిష్కారాల సంస్థగా గుర్తింపు పొందిన సి1.. ఇది కస్టమర్ అనుభవం, సహకారం, ఎంటర్‌ప్రైజ్ నెట్‌వర్కింగ్, డేటాసెంటర్, ప్రపంచ స్థాయి ప్రొఫెషనల్ అండ్ మేనేజ్డ్ సేవలతో కూడిన భద్రతా సామర్థ్యాలలో విభిన్న పరిష్కారాలను అందిస్తుందని సి1 ఇండియా కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు తెలిపారు. తమ గ్లోబల్ ఫోర్స్‌లో 20 శాతం భారతీయులేనని పేర్కొన్నారు. వచ్చే కొన్నేళ్లలో ఇక్కడి ఉద్యోగులను రెట్టింపు చేయనున్నామన్నారు.

బాలాదిత్య నటన ప్రశంసనీయం

ప్రజాశక్తి-కల్చరల్

తెలుగు చిత్ర రంగంలో బాల నటునిగా ప్రవేశించి తనదైన శైలిలో రాణిస్తున్న బలాదిత్య నటన ప్రశంసనీయమని ప్రముఖులు కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా దీక్షితులు కళా వేదికపై కళా నిలయం ప్రముఖ సాంస్కృతిక సంస్థ నిర్వహణలో బాలాదిత్యకు నటసామ్రాట్ అక్కినేని ప్రతిభా పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా శత చిత్ర సినీ నిర్మాత రామ సత్యనారాయణ పాల్గొని బాలాదిత్య ను సత్కరించి మాట్లాడారు. వాచకంలో అభినయంలో పరిణతకల బాలాదిత్యకు మంచి అవకాశాలు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ బాలాదిత్య కుటుంబం అంతా కళాకారులు అన్నారు కళా నిలయం సంస్థ తెలంగాణ రాష్ట్రం లో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందిందన్నారు. వేదిక పై కాంగ్రెస్ నాయకుడు షేక్ పర్వేజ్,నిర్మాత మాగంటి ప్రసాద్, సామజిక వేత్త బద్రీనాథ్,కాకుమాను జ్యోతి తదితరులు పాల్గొన్నారు. సురేందర్ స్వాగతం పలికిన సభకు కార్యదర్శి పుష్పలీల వందన సమర్పణ చేశారు

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

- తొలి క్యాబినెట్లోనే చట్టబద్ధత .
- టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి మంత్రివర్గ సమావేశంలోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో, నాంపల్లి దర్గాలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో, ఆరు గ్యారంటీల కార్డు ఉంచి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐసిసి ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, సీనియర్ నాయకులు అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను, గ్యారంటీలను అమలు చేస్తామని ప్రమాణం చేసినట్టు తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటూ సెప్టెంబర్ 17న తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభలో ఎఐసిసి అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని రేవంత్ గుర్తు చేశారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ప్రతి నెల రూ.2,500, వంట గ్యాస్ రూ.500లకే ఇస్తామన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి హామీలు సోనియాగాంధీ ఇచ్చారని తెలిపారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు రూ.500ల బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్టు తెలిపారు. యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ చేయూత పథకం కింద నెలకు రూ.4 వేల పెన్షన్, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్య బీమా లాంటి పథకాలను అమలు చేస్తామన్నారు.ఎన్నికల సమయంలో కూడా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో ఈ ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రచారం చేసిందన్నారు.

అడ్డుకున్న పోలీసులు

చార్మినార్ వద్దనున్న బాగ్యలక్ష్మి దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు కాంగ్రెస్ నాయకలతోపాటు కార్యకర్తలు, నాయకులు గాంధీభవన్‌కు తరలించారు. 144 సెక్షన్ ఉన్నందున గాంధీభవన్ నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దేవాలయానికి వెళ్లి పూజలు చేయడానికి అవకాశం ఇవ్వరా అంటూ పోలీసులను ప్రశ్నించారు. ఎక్కువ మంది ర్యాలీగా వెళ్లడానికి వీలులేదంటూ పోలీసులు వాదించారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం కొనసాగింది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం బాగ్యలక్ష్మి దేవాలయానికి కాకుండా బిర్లా టెంపుల్, నాంపల్లి దర్గా వద్దకు వెళ్లేందుకు కొద్ది మందికి అవకాశం ఇచ్చారు.